సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం ; 12 ; జనవరి ; 2025



ఖందేవుని జాతరకు వేళాయె

ఈ నెల 13న నిర్వహించనున్న ఖందేవుని జాతర మహాపూజతో ప్రారంభమవుతుంది. 15రోజులపాటు జాతర కొనసాగనుండగా ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. 10లో▸



డార్ఫ్ దంపతులకు ఘన నివాళి

జైనూర్ మండలం మార్లవాయిలో హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతిని నిర్వహించారు. వారి సమాధుల వద్ద ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పూజలు చేసి నివాళులర్పించారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/18.0

చాలా వరకు ఎండగా ఉంటుంది. చలి ప్రభావం తగ్గనుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

బురద రాజకీయాలు మానుకోవాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయిల్ శంకర్

ఆదిలాబాద్: తనపై బురదజల్లే రాజకీయాలు మానుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి తనపై చేసి న వ్యాఖ్యలను ఖండించారు.30 ఏళ్లుగా తా ను రాజకీయాల్లో ఉన్నానని, అయితే ఏనాడు తాను ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఆదిలాబాద్‌లో తాను భూకబ్జాలకు పాల్పడుతున్నానని ఆరోపించడం సత్యదూరమన్నారు. రాజకీయాల్లో విలువలు పాటించాలని, అవమానకరంగా వ్యాఖ్యానించడం సరికాదని పే ర్కొన్నారు. తన అల్లుని ఆస్తులు సక్రమమైనవ ని, అందులో ఎ లాంటి అక్రమాలు లేవని వెల్ల డించారు. వెనుకబడి న వర్గాల నేతగా ఎదుగుతున్న తనను చూసి ఓర్వలేకే అసత్య ఆరోపణ లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలనే ఆలోచనతోనే ప్రభుత్వ స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధి విషయమై సీఎంను కలిస్తే తాను పార్టీ మారుతున్నానంటూ ప్రచారం చేయడం శోచనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రజాప్రతినిధిగా కలిస్తే సైతం విమర్శించడం, ఊహాగానాలు చేయడం సమంజసం కాదన్నారు. తాను ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానన్నారు. ఎన్నికల సమయంలో సైతం ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు తనను ఆశీర్వదించారని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలో జరిగిన యాగాన్ని సైతం రాజకీయం చేసే ప్రయత్నం చేశారని, తాను ఏం చేశానన్నది ప్రజలు అన్ని గమనిస్తారన్నారు. రాజకీయాలు హుందాగా చేయాలని హితవు పలికారు. కార్యకర్తల సైతం సంయమనం పాటించాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు ఆదినాథ్, నగేష్, రత్నాకర్ రెడ్డి, రమేష్, వేణుగోపాల్, లాలా మున్నా, ఆకుల ప్రవీణ్, సోమ రవి, జోగు రవి, రాజేశ్ తదితరులున్నారు.

అధికారికంగా ఓబన్న జయంతి



నివాళులర్పిస్తున్న అధికారులు

ఆదిలాబాద్: వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం శనివారం అధికారికంగా నిర్వహించింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆయన చిత్రపటానికి పలువురు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో రాంరెడ్డి, సీపీవో వెంకటరమణ, డీబీసీడీవో రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



పరిశీలిస్తున్న సీఈ జీఆర్‌చౌహాన్

ఇచ్చోడ: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేలా కృషి చేయాలని ఆ శాఖ సీఈ జీఆర్ చౌహాన్ అన్నారు. మండలకేంద్రంలోని 33 కేవీ ఫీడర్‌ను శనివారం ఆయన పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న ప్రదేశాల్లో గాలిపటాలు ఎగరవేయవద్దని చిన్నారులకు సూచించారు. ఈ మేరకు తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి బాటలో..



విద్యార్థులను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు



ఆదిలాబాద్ బస్టాండ్‌లో రద్దీ



బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

సంక్రాంతి సెలవులు వచ్చేశాయి. విద్యార్థులు ఇంటి బాట పట్టారు. తమ పిల్లలను తీసుకువెళ్లేందుకు తల్లిదండ్రులు ఆయా పాఠశాలలు, కళాశాలలకు శనివారం ఉదయం నుంచే చేరుకున్నారు. దీంతో ఆయా విద్యాసంస్థల వద్ద సందడి వాతావరణం కనిపించింది. ఆదిలాబాద్ బస్టాండ్ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రయాణికులతో రద్దీగా దర్శనమిచ్చింది. - ఆదిలాబాద్

ఏజెన్సీపై ఫోకస్





సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తున్న ఆదివాసీ ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు(ఫైల్)

- ఆదివాసీలపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి
- విద్య, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి భరోసా
- ప్రత్యేక కోటాలో 'ఇందిరమ్మ ఇళ్లు'
- గోండి భాషలో ప్రాథమిక విద్యపై అధ్యయనం
- 'ఉమ్మడి ఆదిలాబాద్'కు ప్రయోజనం
- ముఖ్యమంత్రి సానుకూల స్పందనపై ఆదివాసీల్లో హర్షం

సీఎం రేవంత్‌రెడ్డి ఏజెన్సీ ప్రాంతాలపై ఫోకస్ పెట్టారు. ప్రధానంగా గిరిజనుల్లోని ఆదివాసీ తెగ ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక ప్రగతికి భరోసా కల్పించారు. ఆదివాసీల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ఆదివాసీల్లో హర్షం వ్యక్తం అవుతుంది. ప్రధానంగా టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత ఆయన తొలిసభ ఇంద్రవెల్లిలోనే నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం హోదాలోనూ మళ్లీ ఇదే ప్రాంతానికి రావడం తనకు సెంటిమెంట్‌గా కలిసొచ్చిందనే విషయాన్ని పలువేదికలపై ముఖ్యమంత్రి ప్రస్తావించారు. మరోసారి ఆయన ఆదివాసీ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. - సాక్షి, ఆదిలాబాద్

ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర రాజధానిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి శుక్రవారం ప్రత్యేక సమావేశమైన విషయం తెలిసిందే. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ), గోండ్వానా పంచాయతీ రాజ్‌సెంటర్, ఆదివాసీ సంఘాల నుంచి పలువురు ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. వీరిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. అలాగే రాష్ట్ర మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ప్ర భుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు పాల్గొని ఆదివాసీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఓపిగ్గా విన్న ముఖ్యమంత్రి వాటి పరిష్కారం కోసం రాష్ట్ర అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు ఇవ్వడం గమనార్హం. ఇందులో ప్రధానంగా ఆదివాసీల ఆచా ర, సంప్రదాయాలను గౌరవిస్తూ, మౌలిక వసతుల కల్పనతో పాటు విద్య ఉద్యోగ అవకాశాలకు పెద్దపీట వేశారు. దీంతో ఉమ్మడి జిల్లాకు ఎక్కువ ప్రయోజనం చేకూరనుంది.

నిర్ణయాలు ఇలా..

- కుమురంభీం జయంతి, వర్ధంతిలను ఉత్సవంగా నిర్వహించాలని, అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇంద్రవెల్లి అమరుల స్తూపాన్ని స్మృతి వనంగా మార్చాలని, అమరుల కుటుంబాలకు ఇళ్ల మంజూరు వంటి చర్యలు ఇప్పటికే తీసుకున్నట్లు ప్రస్తావించారు.
- ఐటీడీఏ ప్రాంతాలకు జనాభా ప్రతిపాదికన ప్రత్యేక కోటాలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ కింద ఇందిర జలప్రభ ద్వారా ఉచితంగా బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆదివాసీ రైతుల వ్యవసాయ బోర్లకు సోలార్ పంపు సెట్లు ఉచితంగా అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆదివాసీ గూడేల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా మిషన్ భగీరథ వచ్చినా ఇప్పటికీ ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య జటిలంగానే ఉంది. సీఎం నిర్ణయం నేపథ్యంలో గూడేల్లో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందా అని ఎదురు చూస్తున్నారు.
- ఆదివాసీల మాతృభాష గోండిలో ప్రాథమిక విద్య అందించే అంశంపై అధ్యయనం చేసి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా ఆదివాసీల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్, మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. విదేశాల్లో చదువుకునే ఆదివాసీ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలన్నారు. ఉట్నూర్‌లోని బీఈడీ కళాశాలకు టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి ఆదేశాలిచ్చారు.
- ఆదివాసీ రాయిసెంటర్లకు పక్కా భవనాలు నిర్మించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కేస్లాపూర్ జాతరకు పెద్ద ఎత్తున నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు.
- ఉద్యమాల్లో ఆదివాసీలపై పెట్టిన కేసులు తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం పేర్కొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానంగా ఆదివాసీ, లంబాడాల మధ్య విద్వేషాల కారణంగా గతంలో ఆదివాసీలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఇటీవల జైనూర్ ఘటనలోనూ ఆదివాసీలు ఉద్యమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వందలాది మంది కేసులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో సీఎం సానుకూలంగా స్పందించడంపై ఆదివాసీ సంఘాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

చిత్తశుద్ధితో పరిష్కరిస్తాం



ఆదివాసీల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తాం. ప్రభుత్వ పరిధిలో అన్ని విధాలుగా తోడుంటాం. సీఎం రేవంత్‌రెడ్డి ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వస్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.
– సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

ఏడాదికి మూడుసార్లు కలుస్తామని సీఎం చెప్పారు



ఏడాదిలో మూడుసార్లు ఆదివాసీలతో సమావేశం అవుతానని సీఎం సార్ చెప్పడం మాకు ఆనందాన్ని ఇచ్చింది. సమావేశంలో ముఖ్యమంత్రి గారు మొదట మా సమస్యలను పూర్తిస్థాయిలో విన్నారు. వాటి పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇంకా ఏమైనా ఉన్నా మంత్రి సీతక్క ద్వారా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. – గోడం గణేశ్, తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్

ఆదివాసీల అభివృద్ధికి సీఎం సానుకూలం

- బీఆర్ఎస్ పాలనలో ఒరిగిందేమీలేదు
- మాజీ ఎంపీ సోయం బాపూరావ్



మాట్లాడుతున్న సోయం బాపూరావు

ఆదిలాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదివాసీలకు అన్యాయమే తప్ప ఒరిగిందేమీ లేదని మాజీ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఆదివాసీలను మాయమాటలతో మభ్యపెట్టి మోసగించిందని, ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. సీఎం రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ సర్కారు మాత్రం ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించడం హర్షనీయమన్నారు. ఏళ్లుగా ఆదివాసీలు హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘమైన ఉద్యమం చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తొలిసారిగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ఆదివాసీ పెద్దలతో సమావేశమై అభిప్రాయాలు సేకరించడం, అనేక సమస్యలపై చర్చించడం అభినందనీయమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి ఏ ఒక్క ఆదివాసీకి న్యాయం చేయలేదని విమర్శించారు. మళ్లీ ప్రతిపక్ష హోదాలోనూ అదే విధానాన్ని అవలంభిస్తోందని మండిపడ్డారు. నాడు సమస్యలపై పోరాటం చేసిన ఉద్యమ నాయకులపై ఎన్నో కేసులు పెట్టారన్నారు. ఆదివాసీల ఉసురుతగిలి రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం కోల్పోయిందన్నారు. అయితే ఏజెన్సీ ప్రాంత సమస్యలపై కులంకశంగా చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి వాటి పరిష్కారంపై సానుకూలంగా స్పందించారన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు గోక గణేశ్‌రెడ్డి, బొల్లారం బాబన్న తదితరులు పాల్గొన్నారు.

'వెరబెల్లి'కి నిరాశే!

- బీజేపీ ఎమ్మెల్సీ స్థానానికి దక్కని టికెట్
- భవిష్యత్‌లో అవకాశాలకు హామీ



వెరబెల్లి రఘునాథ్‌రావు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కరీంనగర్–ఆదిలాబాద్–మెదక్–నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టికెట్ ఆశించిన బీజేపీ నాయకులకు నిరాశే ఎదురైంది. రాష్ట్రంలో జరగనున్న రెండు టీచర్, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఆ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎవరికీ అవకాశం దక్కలేదు. గత కొన్ని రోజులుగా తనకే టికెట్ వస్తుందనే ధీమాతో మంచిర్యాల జిల్లా పార్టీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు ఉండగా నిరాశే మిగిలింది. ఇప్పటికే ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో పర్యటించి అనేక కార్యక్రమాలు చేపట్టారు. యువతతో కార్యకలాపాలు చేపడుతూ పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి తన అభ్యర్థిత్వాన్ని విన్నవించారు. రూ.లక్షలు ఖర్చు చేసి పట్టభద్రులకు అవగాహన, యువతను ఓటర్లుగా నమోదు చేయించారు. పార్టీ నుంచి తనకు అవకాశం ఉంటుందనే నమ్మకంతో విస్తృతంగా ప్రచారం చేశారు. పెద్దయెత్తున యువకులను ఓటర్లుగా నమోదు చేయించారు. 'వెరబెల్లి' విన్నపాన్ని పార్టీ పక్కనబెట్టడంతో ఆయన అనుచరులు నిరాశకు గురయ్యారు. ఆయనను కాదని సంగారెడ్డి జిల్లాకు చెందిన సి.అంజిరెడ్డి అభ్యర్థిత్వాన్ని పట్టభద్రుల స్థానానికి ఖరారు చేసింది. టికెట్ ఆశించి భంగపడిన 'వెరబెల్లి'కి భవిష్యత్‌లో మెరుగైన అవకాశాలు కల్పిస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చినట్లు తెలిసింది. కాగా, ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గటిక క్రాంతికుమార్ కూడా ప్రయత్నాలు చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మణ్‌ను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీకి అవకాశం కల్పించాలని విన్నవించారు. అంతేకాకుండా పలువురు తమ ప్రయత్నాలు చేసినప్పటికీ నిరాశే ఎదురైంది.

మొక్కజొన్నకే మొగ్గు





ఇచ్చోడలో సాగువుతున్న మొక్కజొన్న

- యాసంగి సాగుకు రైతుల ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ఇక్కడ కనిపిస్తున్నది బజార్‌హత్నూర్ మండలం డిగ్నూర్ గ్రామానికి చెందిన రైతు జగన్. గతేడాది రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. దిగుబడి 70 క్వింటాళ్లు వచ్చింది. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి రావడంతో ఈ ఏడాది నాలుగెకరాల్లో సాగు చేస్తున్నాడు. కనీసం 140 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో చాలామంది రైతులు ఈ యాసంగిలో మొక్కజొన్న సాగుకే మొగ్గు చూపారు.

ఇచ్చోడ: యాసంగిలో రైతులు ఎక్కువగా మొక్కజొన్న సాగుకే ఆసక్తి కనబరుస్తున్నారు. ఏటేటా ఈ పంట సాగు విస్తీర్ణం పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. ఆరుతడి పంట కావడం, తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు వస్తుండడం, ప్రైవేట్‌లోనూ గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో 2019లో మొక్కజొన్నకు రూ.1,760 మద్దతు ధర ప్రకటించింది. దీంతో జిల్లాలో ఈ పంట సాగుకు రైతులు ముందుకు వచ్చారు. ఆ ఏడాది రికార్డు స్థాయిలో 35 వేల ఎకరాల్లో సాగైంది. అయితే 2020లో ప్రభుత్వం మక్క సాగు చేయవద్దని, ఒకవేళ చేస్తే మద్దతు ధరతో పంటను కొనుగోలు చేయమని ప్రకటించింది. దీంతో రైతులు ఆ ఏడాది సాగు విస్తీర్ణం కొంత తగ్గించారు. గతంలో మాదిరిగా శనగ, ఎర్రజొన్నల వైపు మళ్లారు. అయితే అవి ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో మళ్లీ మక్కపైనే దృష్టి పెట్టారు. మొక్కజొన్నకు ప్రైవేట్‌లోనూ మంచి ధర పలుకుతుండడంతో గడిచిన నాలుగేళ్లుగా సాగు విస్తీర్ణం క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది.

లాభసాటిగా ఉండడంతో..

లాభసాటి పంటల్లో మొక్కజొన్న ఒకటి. ఆరుతడి పంటగా దీనినే ఎక్కువగా సాగు చేస్తారు. ఎరువులు తక్కువ మోతాదులో అవసరం ఉండడంతో పాటు పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురిసినా పెద్దగా నష్టం వాటిల్లదు. ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. మద్దతు ధర ఉంటే ఎకరాకు సుమారు రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు మిగులుతాయని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో నాలుగేళ్లుగా మొక్కజొన్న సాగు వివరాలు

సంవత్సరం	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
2020–21	4,600
2021–22	8,303
2022–23	13,417
2023–24	14,211

ప్రైవేట్‌లోనూ మంచి ధర...

మొక్కజొన్నకు ప్రైవేట్‌లోనూ మంచి ధర పలుకుతుంది. గతేడాది క్వింటాల్‌కు రూ.1,400 నుంచి రూ.1,500 వరకు పలికింది. అయితే ప్రైవేట్ వ్యాపారులు నేరుగా పంట పొలానికే వచ్చి కొనుగోళ్లు చేస్తుండడంతో రైతులకు రవాణా ఖర్చు తగ్గుతోంది.

మద్దతు ధర ప్రకటించాలి



యాసంగిలో మొక్కజొన్న సాగు అనుకూలంగా ఉంటుంది. అందుకే ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతుంది. ప్రభుత్వం కూడా మక్కకు మద్దతు ధర ప్రకటించాలి. ప్రభుత్వరంగ సంస్థ ద్వారా పంట దిగుబడిని కొనుగోలు చేయాలి. ఈ దిశగా చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి.
– చెన్నల గంగారెడ్డి, భారతీయకిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

అరెస్టులకు భయపడం..



జాతీయ రహదారిపై బైఠాయించిన మాజీ మంత్రి రామన్న, నాయకులు, రైతులు

- రైతులకు అండగా ఉంటాం
- మాజీ మంత్రి జోగు రామన్న

బేల(జైనథ్): రైతులకు అండగా నిలుస్తూ చేపట్టే నిరసనలు, ఆందోళనల్లో భాగంగా అరెస్టులకు భయపడమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు మోసాన్ని నిరసిస్తూ జైనథ్ మండలం బోరజ్ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో పాటు పెట్టుబడి సాయం అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను నిత్యం ప్రజల్లో ఎండగడతామన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. ఇందులో నాయకులు ఇజ్జగిరి నారాయణ, యాసం నర్సింగ్ రావు, మార్శెట్టి గోవర్ధన్, లింగారెడ్డి, గణేశ్‌యాదవ్, విజయ్, రాజన్న, దేవన్న, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్: చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అశోక్‌రోడ్‌లో గల పతంగుల దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రూ.50 వేల విలువల గల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యాపారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, చైనా మాంజాతో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం దానిని నిషేధించిందన్నారు. అలాగే పతంగులు విద్యుత్ వైర్లకు చిక్కుకుంటే తీసేందుకు యత్నించొద్దన్నారు. ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే అవకాశాలు ఉంటాయన్నారు. తల్లి దండ్రుల సూచనలు, జాగ్రత్తలు పాటిస్తూ పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట వన్‌టౌన్ సీఐ సునీల్, ఎస్సై ఇసాక్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు ఉమ్మడి జిల్లా వాసులు

మంచిర్యాలటౌన్: ఢిల్లీలో ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పలువురికి ఆహ్వానం లభించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 41మంది ప్రత్యేక ఆహ్వానితులను కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఎంపిక చేయగా.. వీరిలో ఉమ్మడి జిల్లాకు చెందిన పది మంది ఉన్నారు. పీఎం యశస్వి పథకం, టెక్స్‌టైల్(హ్యాండిక్రాఫ్ట్స్), హస్తకళలు రంగాల్లో వారు చేసిన కృషిని గుర్తిస్తూ ఆహ్వానించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై వేడుకలను తిలకించనున్నారు. ఎంపికైన వారిలో హస్తకళల విభాగంలో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం తాడిహత్నూర్ గ్రామానికి చెందిన జాడే సుజాత, కుమురంభీం జిల్లా కౌటాల మండలం పర్డి గ్రామానికి చెందిన ఎస్.జయంతి రాణి, రూరల్ డెవలప్‌మెంటు విభాగంలో కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలం కుకుడ గ్రామానికి చెందిన పోర్తెటి శ్రీదేవి, ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం గిన్నెర గ్రామానికి చెందిన మేస్రం లలిత, ఆదిలాబాద్ మండలం పోతగూడకు చెందిన ఆత్రం రాంబాయి, సిడాం భీంరావు, ఉట్నూర్ మండలం బీర్సాయిపేట గ్రామానికి చెందిన కొప్పాడ లక్ష్మీబాయి, అయ్యు, మడావి రాంబాయి, మానిక్‌రావు ఉన్నారు.

యువతిని వేధిస్తున్న లెక్చరర్‌పై పోక్సో కేసు

నిర్మల్‌రూరల్: యువతిని వేధిస్తున్న కళాశాల లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిర్మల్ రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివింది. ఆ సమయంలో అదే కళాశాలకు చెందిన లెక్చరర్ చరణ్‌దాస్‌రెడ్డి యువతి మొబైల్‌కు మెసేజ్‌లు, ఫోన్ కాల్స్ చేస్తూ వేధించేవాడు. ఇంటర్ పూర్తయ్యాక యువతి ప్రస్తుతం హైదరాబాద్‌లోని కళాశాలలో చదువుతోంది. అయినా ఆమెను ఫోన్‌లో వేధించసాగాడు. విసిగిపోయిన యువతి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. వారు వెంటనే శుక్రవారం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భూనిర్వాసిత కార్మికులను పర్మినెంట్ చేయాలి


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్: భూనిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. మండలంలోని పెగడపల్లిలో హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో పవర్ ప్లాంటు భూ నిర్వాసితుల కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం దత్తత గ్రామంగా ప్రకటించిన పెగడపల్లి.. ప్లాంటు కాలుష్యంతో దుమ్ముతో నిండిందన్నారు. భూసేకరణ సమయంలో ఇచ్చిన హామీలను యాజమాన్యం తుంగలో తొక్కిందన్నారు. హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో ఈనెల 18న పవర్ ప్లాంట్‌లో జరిగే సమ్మెకు గ్రామస్తుల మద్దతు కోరారు. కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు. హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ తిప్పరపు సారయ్య, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, ఉపాధ్యక్షులు సాయికృష్ణ, సంపత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నవీన్, నాయకులు పాల్గొన్నారు.

ఖందేవుని జాతరకు వేళాయె..

- ఏర్పాట్లు పూర్తిచేసిన తొడసం వంశస్తులు
- నేడు మాసేమాల్‌పేన్ దేవతకు పూజలు
- 13న మహాపూజ ప్రారంభం
- 14న నువ్వుల నూనె తాగనున్న తొడసం వంశానికి చెందిన ఆడబిడ్డ


నార్నూర్‌లోని ఖందేవ్ ఆలయం


ఆలయంలోని పులి విగ్రహం

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు.. వారి ఆచార వ్యవహారాలు ఆధునిక యుగంలోనూ పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా నార్నూర్ మండలంలోని ఖందేవుని జాతర ప్రత్యేకం. ఈనెల 13న నిర్వహించే మహాపూజతో జాతర ప్రారంభం కానుంది. పదిహేను రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు దేశంలోని తొడసం వంశస్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఇందుకు తొడసం వంశస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

మాసేమాల్‌పేన్ పూజలతో ప్రారంభం..

12న ఆదివారం రాత్రి మాన్కాపూర్‌లో మాసేమాల్ పేన్ దేవతకు తొడసం వంశస్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రి అక్కడే బసచేసి మరుసటి రోజు సోమవారం రాత్రి దేశంలోని నలుమూలల నుంచి తరలివచ్చిన తొడసం వంశస్తులు ఖందేవ్ క్షేత్రానికి చేరుకుంటారు. రాత్రి వారి ఆచారం ప్రకారం ఖందేవునికి పుష్య పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 14న మంగళవారం ఖందేవ్ ఆలయ సన్నిధిలో తొడసం వంశానికి చెందిన ఆడబిడ్డ నాగుబాయి చందు (కడోడ కిత్తకు చెందిన) తొడసం వంశంలోని ఇళ్ల నుంచి సేకరించిన రెండు కిలోలకు పైగా నువ్వులతో తయారు చేసిన నూనె తాగి తమ మూడో మొక్కును తీర్చుకోనుంది. ఈమె మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా జివితి తాలుకా కొద్దాపూర్ గ్రామానికి చెందిన ఆడబిడ్డ. ఇలా తాగడం వల్ల సంతానం లేదా ఏదైనా మంచి జరుగుతుందని వారి నమ్మకం. జాతర సందర్భంగా క్రీడాపోటీలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

14న మినీ దర్బార్, సంప్రదాయ భేటీ..

తొడసం వంశస్తులు మహాపూజ, సంప్రదాయ మొక్కులు చెల్లించిన అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తొడసం వంశస్తులు ఒక దగ్గరకు చేరుకుని ఈనెల 14న సంప్రదాయ భేటీ నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధితోపాటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. అనంతరం ఆలయ ఆవరణలో మినీ ప్రజాదర్బార్ నిర్వహించి సమస్యలను వివరిస్తారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేలతోపాటు ప్రజాప్రతినిధులు తరలివస్తారు. అయితే ఆలయ కమిటీ సహకారంతో తొడసం వంశపెద్దలు తొడసం బావురావు కటోడ, తొడసం ఆనందరావు కటోడ, తెలంగాణరావు పటేల్, ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయం చరిత్ర..

102 ఏళ్ల క్రితం నార్నూర్ గ్రామంగా మారినప్పుడు ఈ ప్రాంతం అంత దట్టమైన అడవులు, గుట్టలు, కొండలు, భయంకరమైన మృగాలతో ఉండేది. ఈ గ్రామానికి చెందిన తొడసం ఖమ్ము పటేల్ నిద్రలో ఖందేవుడు వచ్చి గ్రామం శాంతియుతంగా ఉండాలంటే తనను ఆరాధ్య దైవంగా స్వీకరించమని చెప్పాడు. మరుసటి రోజు ఖమ్ము పటేల్ తెల్లవారు జామున లేచి నలుగురు గ్రామపెద్దలను తీసుకుని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లగా కలలో చెప్పిన స్థలంలో ఖందేవుడు ఓ స్తంభంలా వెలిసి కనిపించాడని తొడసం వంశస్తులు చెబుతున్నారు. అయితే ఆ రోజు పౌష్య పౌర్ణమి కావడంతో అప్పటి నుంచి ప్రతీ పౌర్ణమికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకుంటారు.

తొడసం విజయంగా ఏనుగు విగ్రహం

ధృవరాజులు వారి పాలనలో ఏనుగులను యుద్ధం సమయంలో ఉపయోగించేవారు. రాజ్యంలో ఏనుగులు ప్రజల పంటలను ధ్వంసం చేయడం తోపాటు ఇబ్బందులకు గురిచేయడంతో వాటిని పట్టుకోవడానికి బహుమతి ప్రకటన చేశారు. తొడసం వంశస్తులు ప్రస్తుతం గాదిగూడ మండలంలోని రోమన్‌కాసా (అప్పటి గోండ్వానా రాజ్యంలో ఉన్న ఎనికాసా) గ్రామం వద్ద ఏనుగులు నిద్రపోతున్న సమయంలో పట్టుకుని ఖందేవ్ పుణ్యక్షేత్రం సమీపంలో చింతచెట్టు వద్ద కట్టేశారు. దీంతో ఆత్రం వంశానికి చెందిన రాజు 'సవ్వ చాలీస్'రాజ్యాన్ని తొడసం వంశానికి అప్పగించాడు. అప్పటి నుంచి ఏనుగును తొడసం వంశానికి విజయంగా భావిస్తూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



ఖందేవుని పూజ కోసం తొడసం వంశస్తులు, భక్తులు తరలివస్తారు. జాతరకు వచ్చేవారి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– తొడసం నాగోరావు, ఆలయ కమిటీ చైర్మన్

కొనసాగుతున్న ఫుట్‌బాల్ లీగ్ పోటీలు


తలపడుతున్న ఆదిలాబాద్- నిజామాబాద్ జట్లు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో జరుగుతున్న తెలంగాణ అండర్–13 బాలికల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు మూడో రోజు కొనసాగాయి. శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో మొదటి మ్యాచ్ ట్విన్ సిటీస్ హైదరాబాద్, గజ్వేల్ జట్ల మధ్య జరుగగా 3–0 గోల్స్ తేడాతో ట్విన్ సిటీస్ హైదరాబాద్ జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్ ఉమ్మడి ఆదిలాబాద్, కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్‌ల మధ్య జరుగగా 3–0 గోల్స్ తేడాతో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు గెలుపొందింది. మరో లీగ్ మ్యాచ్ హైదరాబాద్ ఉమెన్స్ క్లబ్, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, హకీంపేట్‌ల జట్ల మధ్య జరుగగా నాలుగు గోల్స్ చేసి స్పోర్ట్స్ స్కూల్ జట్టు విజయం సాధించింది. పట్టణ ఎస్సై రాజశేఖర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, జిల్లా బాస్కెట్ బాల్ సెక్రెటరీ చంద్రమోహన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తదితరులు అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

అలరించిన 'క్యాంప్ ఫైర్'..

తెలంగాణ అండర్–13 బాలికల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల సందర్భంగా పోటీల నిర్వాహకులు క్యాంప్ ఫైర్ ఏర్పాటుచేశారు. శనివారం రాత్రి లీగ్ మ్యాచ్‌ల అనంతరం క్యాంప్ ఫైర్‌తోపాటు డీజే మ్యూజిక్ ఏర్పాటు చేయగా క్రీడాకారులు ఆడిపాడారు. వివిధ జిల్లాల క్రీడాకారులు క్యాంప్‌ఫైర్ చుట్టూ నిలబడి ఉత్సాహంగా నృత్యాలు చేశారు. పోటీల నిర్వాహకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్టెప్పులు వేశారు. పట్టణ ఎస్సై రాజశేఖర్ ఈ క్యాంప్ ఫైర్‌ను ప్రారంభించారు.

జనసంద్రమైన దీక్షభూమి


జనసంద్రమైన జాతీయ బంజారా దీక్ష భూమి

- ఘనంగా గురుకృప దినోత్సవం
- భోగ్ బండారో నిర్వహించిన దీక్ష గురువు
- పాల్గొన్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యేలు

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి(హెచ్) గ్రామంలో జాతీయ బంజారా దీక్ష భూమి జనసంద్రమైంది. వివిధ రాష్ట్రాల నుంచి లంబాడి గిరిజనులు భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. పీఠాధిపతి దీక్షగురువు సద్గురు శ్రీ ప్రేమ్‌సింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో గురుకృప దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్, జగదాంబదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి భోగ్ బండారో నిర్వహించారు. మంచిర్యాల జిల్లా జన్నారం నుంచి శ్రీ సేవాలాల్ మహరాజ్ పల్లకితో బయల్దేరిన శోభాయాత్ర నార్నూర్ మండలంలోని గంగాపూర్ గ్రామానికి చేరుకుంది. అక్కడి నుంచి సంప్రదాయ నృత్యాలు ఆటపాటలతో దీక్షభూమి వద్ద చేరగా భక్తులకు దీక్ష గురువు ఆశీర్వదించారు. లంబాడి మహిళలు సంప్రదాయ నృత్యాలు, పాటలతో హోరెత్తించారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్, బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్, కోవలక్ష్మి, కుమురం భీం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్‌లు పూజలో పాల్గొన్నారు. రాష్ట్రంలో కొత్తపల్లి(హెచ్) గ్రామంలో ఉన్న ఏకైక బంజారా జాతీయదీక్ష భూమి అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తామని వారు తెలిపారు. అనంతరం దీక్ష గురువు మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావంతోనే సమాజం జాగృతం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 5 వేల మంది పైగా తరలివచ్చారు. నార్నూర్ సీఐ రహీంపాషా ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జేఏసీ నాయకులు బానోత్ జగన్, కవి గాయకుడు బంకట్‌లాల్, నాయక్ ఠాక్రునాయక్, బీజేపీ నాయకులు రాథోడ్ రితేశ్, రాథోడ్ శేషారావు, మాజీ సర్పంచ్ చౌహాన్ డిగంబర్ తదితరులు పాల్గొన్నారు.


దీక్ష గురువుతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


శ్రీ సేవాలాల్ మహరాజ్ పల్లకితో వెళ్తున్న భక్తులు

హైమన్ డార్ఫ్ దంపతులకు ఘన నివాళి


విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జైనూర్: ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ దంపతుల ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎంపీ గోడం నగేశ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. డార్ఫ్ దంపతుల వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని మార్లవాయిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం వారి సమాధులు, విగ్రహాల వద్ద ఆదివాసీ ఢోలు, వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు చేసి ఘన నివాళులర్పించారు. గుస్సాడీ కనకరాజుకు నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. యువత పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మార్లవాయిలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఏఎస్పీ చిత్తరంజన్‌లతో కలిసి వారు ప్రారంభించారు. చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై సిర్పూర్(యు) మండలం కోహినూర్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్లకార్డులతో ఆటాపాటల రూపంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ హైమన్ డార్ఫ్ దంపతులు ఆదివాసీల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. గతంలో 30 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజన శాఖ మంత్రిగా ఉన్నప్పుడు పని చేసిన సమయంలో పెసా చట్టం తీసుకురావడంలో సమష్టిగా పనిచేసి జాతి అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నతంగా చదువుకోవాలన్నారు. రైతులు గంజాయి సాగు చేయొద్దన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని పెర్సాపేన్ ఆలయాల అభివృద్ధి, రాయిసెంటర్ల భవనాల మంజూరు, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ బలోపేతం, నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.


రక్తదానం చేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ


ప్రదర్శన ఇస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

వడగామ్‌కు 'మెస్రం' పాదయాత్ర


బట్టగూడలో ఘూరి దేవతకు మొక్కుతున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగోబా మహాపూజకు అవసరమయ్యే పవిత్ర గంగాజలం కోసం ఈనెల 10న కేస్లాపూర్ నుంచి మెస్రం వంశీయులు బయల్దేరారు. మండలంలోని బట్టగూడలో తొలిరోజు బస చేశారు. శనివారం ఉదయం గ్రామస్తులు ఘూరి దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వారికి అతిథి మర్యాదలు చేశారు. అక్కడి నుంచి పాదయాత్రగా వెళ్లి సాయంత్రం వడగామ్‌కు చేరుకుని బస చేశారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని సాలేవాడకు, 13న ధర్ముగూడ, 14న కొత్తగూడ, 15న కడెం మండలంలోని ఉడుంపూర్, 16న దస్తురాబాద్ మండలంలోని మల్లాపూర్, 17న మంచిర్యాల జిల్లా జన్నారం మండలం గోదావరి హస్తినమడుగుకు చేరి పూజల మధ్య గంగాజలం సేకరించనున్నారు. తిరుగు ప్రయాణంలో 18న ఉట్నూర్‌కు చేరి బస చేయనున్నారు. 19న ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్, 20న ఇంద్రవెల్లి మండలంలోని దొడందకు చేరి గ్రామ పొలిమేరలో పవిత్ర గంగాజలాన్ని భద్రపర్చి తమ తమ గ్రా మాలకు వెళ్లనున్నారు. 24న ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పుష్యమాసం అమావాస్య పురస్కరించుకొని 28న పవిత్ర గంగాజలంలో నాగోబా విగ్రహానికి జలాభిషేకం చేయడంతోపాటు ఆలయాన్ని శుద్ధి చేసి మహాపూజ నిర్వహించి జాతర ప్రారంభించనున్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

వేర్వేరు ఘటనల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైలు కిందపడి యువకుడు, అప్పుల బాధతో యువరైతు, భర్త మద్యం మానడం లేదని భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఉరేసుకుంది.

రైలు కిందపడి యువకుడి..


బానేష్ (ఫైల్)

తాండూర్: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఉప్పట్ల బానేష్ (25) సెంట్రింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. తాగుడుకు బానిసయ్యాడు. సెంట్రింగ్ పనులకు వచ్చిన డబ్బులతో మద్యం తాగి ఇంట్లో గొడవపడేవాడు. ఈక్రమంలో శనివారం రేచినీరోడ్-రేపల్లెవాడ మధ్యలో ఉన్న రైలు పట్టాలపైకి రాగా, ఢిల్లీ వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఉరేసుకుని మహిళ..

భైంసారూరల్: ఉరేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు. మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ఇరగదెండ్ల బాలుబాయి (46) గత కొన్నిరోజులుగా ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా బాధపడుతోంది. రోజు మాదిరిగా శుక్రవారం రాత్రి తన కుటుంబీకులతో భోజనం చేసి నిద్రకు ఉపక్రమించింది. శనివారం ఉదయం లేచి చూసేసరికి బాలుబాయి ఇంట్లో రాడ్‌కు ఉరేసుకుని కనిపించింది. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మృతురాలికి భర్తతోపాటు ఒక కూతురు ఉంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అప్పుల బాధతో యువరైతు

- డిసెంబర్ 31న పురుగుల మందు తాగిన అన్నదాత
- చికిత్స పొందుతూ మృతి


కినక శంకర్(ఫైల్)

ఇంద్రవెల్లి: అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పిప్రి గ్రా మంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై సునీల్, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కినక శంకర్ (38) రైతు. తనకున్న ఐదెకరాల్లో పత్తి, సోయా సాగు చేస్తున్నాడు. పెట్టుబడి నిమిత్తం రెండేళ్ల క్రితం తెలిసిన వడ్డీ వ్యాపారి నుంచి రూ.2లక్షలు అప్పు తెచ్చాడు. అయితే రెండేళ్లుగా పంట దిగుబడి సరిగా లేక తీసుకున్న అప్పు చెల్లించలేక పోయాడు. ఈ క్రమంలో కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. అప్పు చెల్లించే మార్గం లేక డిసెంబర్ 31న మద్యం మత్తులో ఓ రైతు వ్యవసాయ చేనుకు వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు ప్రేమిత్, కూతురు పూజ ఉన్నారు.

భర్త మద్యం మానడం లేదని..

పెంబి: భర్త మద్యం మానడం లేదని భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌హెచ్‌వో హన్మాండ్లు కథనం ప్రకారం..మండలంలోని మందపల్లికి చెందిన తలా రి దేవక్క(52), తలారి రాజన్న భార్యాభర్తలు. వీరి కి ముగ్గురు కుమారులు ఉన్నారు. రాజన్న మద్యానికి బానిసయ్యాడు. తాగిన మత్తులో తరచూ దేవక్కతో గొడవపడేవాడు. మద్యం మానేయాలని ఎంత చెప్పినా భర్త వినలేదు. దీంతో మనస్తాపం చెందిన దేవక్క ఈనెల 5న ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు నిర్మల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఇంటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కుమారుడు రాజేందర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని కూలీ మృతి

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి సమీపంలో గల శ్రీవేంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో ట్రాక్టర్ ఢీకొని కూలీ మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నర్సాపూర్(బి) గ్రామానికి చెందిన గాయాకాంబ్లే శుదోధన్ (38) గత మూడేళ్లుగా పత్తి సీజన్‌లో కన్నెపల్లి వేంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి మిల్లులో పనిచేసే క్రమంలో మరో కూలీ సోన్‌కాంబ్లే కిరణ్ ట్రాక్టర్‌ను అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి శుదోధన్‌ను ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన అతన్ని లక్సెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఉషత్తే ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఇద్దరి బైండోవర్

భీమిని: గతంలో కోడిపందెలు ఆడుతూ పట్టుబడిన ఇద్దరిని శనివారం బైండోవర్ చేసినట్లు కన్నెపల్లి ఎస్సై గంగారాం తెలిపారు. మెట్టుపల్లికి చెందిన చంద్రగిరి రాజేష్, కారెం సంతోష్‌లను బైండోవర్ చేసి కౌన్సెలింగ్ ఇచ్చిపంపించారు. జూదం, పేకాట, కోడిపందెలు ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
HOUSE FOR SALE
Luxury 5 BHK Villa For Sale in Goa, Pvt Swimming Pool, Rs. 25Cr. Call 9881931111 Broker Excuse [HA-33491]

WANTED
Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256034]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462